
సాక్షి గుంటూరు

శనివారం ׀ 22 ׀ మార్చి ׀ 2025



విజిలెన్స్ తనిఖీలు

బాపట్లటౌన్: బాపట్ల పట్టణంలోని పలు దుకాణాల్లో శుక్రవారం రాత్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సీఐ ఆది నారాయణ పాల్గొన్నారు.



సాగర్ నీటి మట్టం

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటి మట్టం శుక్రవారం 519.60 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన విద్యుత్ శాఖ క్రీడా పోటీలు

గుంటూరు వెస్ట్: గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఇంటర్ సర్కిల్ క్రీడా పోటీలు శుక్రవారంతో ముగిశాయి.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శని)	సహర్ (ఆది)
గుంటూరు	6.24	4.54
నరసరావుపేట	6.26	4.56
బాపట్ల	6.24	4.55

న్యూస్‌రీల్

విద్యాశాఖ వెబ్‌సైట్‌లో టీచర్ల సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ, జెడ్పీ, మున్సిపల్, నగర పాలకసంస్థ పాఠశాలల్లో పని చేస్తున్న గ్రేడ్-2 హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్, పీఈటీ, ప్రైమరీ హెచ్‌ఎం, ఎస్జీటీ కేడర్‌ల వారీగా ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితాలను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఈవోజీఎన్‌టీ.బ్లాగ్‌స్పాట్.కామ్ సైట్‌లో పొందుపర్చిన సీనియార్టీ జాబితాపై అభ్యంతరాలు ఉన్న పక్షంలో ఈనెల 26న సాయంత్రం 5.00 గంటల లోపు గుంటూరు డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

27న నిధి ఆప్‌కే నికట్

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరులోని ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్) ప్రాంతీయ కార్యాలయ ఆధ్వర్యంలో ఈనెల 27న నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమాన్ని ఆరు జిల్లాల్లో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో ఉదయం 9.30 గంటల నుంచి జరగనున్న సమావేశాల్లో యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లతోపాటు ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో పరస్పరం ముఖాముఖీగా చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈనెల 27న సెలవు దినంగా పరిగణించినచో మరుసటి రోజున అదే వేదికల వద్ద యథావిధిగా నిధి ఆప్ కే నికట్ జరుగుతుందని పేర్కొన్నారు. పీఎఫ్ భాగస్వామ్య యజమానులందరు కార్యక్రమానికి విధిగా హాజరై, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఉద్యోగులతోపాటు అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిధి ఆప్‌కే నికట్ కార్యక్రమానికి హాజరుకాగోరు వాటాదారులు, ఇతర శాఖల అధికారులు సూచనలు చేయవచ్చని తెలిపారు. గుంటూరు అరండల్ పేటలోని ఈఎస్‌ఐసీ డీసీబీవో, కృష్ణాజిల్లా చిన్న అవుటపల్లిలోని డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్, ప్రకాశం జిల్లా అద్దంకిలోని ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ జిల్లా పామర్రు మండలం కురుమద్దాలిలోని రాణి అక్వా, బాపట్లలోని పాలిటెక్నిక్ కళాశాల, పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని వసంత ఇండస్ట్రీస్‌లో నిర్వహించనున్న నిధి ఆప్‌కే నికట్‌లో యజమానులందరూ పాల్గొని ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- పల్నాడు జిల్లాలో 99శాతం హాజరు
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన అధికారులు

నరసరావుపేట ఈస్ట్: జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. 128 పరీక్ష కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లిష్ పరీక్షకు 25,346 మంది రెగ్యులర్ విద్యార్థులకు గాను 25,111 మంది హాజరయ్యారు. సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దూరవిద్య పదవ తరగతి తెలుగు, ఉర్దూ పరీక్షకు జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 1,151మందికి గాను 1,013మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన 13 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 75 కేంద్రాలను తనిఖీ చేశాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ గురజాల, రెంటచింతలలోని నాలుగు కేంద్రాలు, జిల్లా పరీక్షల పరిశీలకులు ఎస్.గీత చిలకలూరిపేటలోని 11 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. జిల్లా పరిధిలో మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని డీఈఓ చంద్రకళ తెలిపారు.

పరీక్షల డ్యూటీ నుంచి ఇద్దరు ఉపాధ్యాయుల తొలగింపు

గురజాల : పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని శుక్రవారం డీఈవో చంద్రకళ తనిఖీ చేశారు. గురజాలలోని నాలుగు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు రోజులు కిందట జరిగిన హిందీ పరీక్షలో ఒక ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు బిట్లు అందించారని పలు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో డీఈవో కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పల్లెగుంతలోని మోడల్ పాఠశాలలో పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని, ఎటువంటి ఇబ్బందులు లేవని తెలిపారు. ఆరోపణలు వచ్చిన ఇద్దరు ఉపాధ్యాయులను పరీక్షల డ్యూటీ నుంచి తొలగించినట్లు ఆమె చెప్పారు.

బతుకు భారంగుండె..!

- పెయింటర్ల ఆవేదన
- ఆధునిక పద్ధతులతో ఉపాధికి గండి
- వృత్తికి స్వస్తి పలుకుతున్న కార్మికులు
- ఇతర ఉపాధి మార్గాలపై దృష్టి

పట్నంబజారు: రంగుల హరివిల్లును అందంగా ఆవిష్కరించే కళాకారులు వారు.. అందమైన బొమ్మలను సుమనోహరంగా తీర్చిదిద్దే అపరబ్రహ్మలు పెయింటర్లు. ఏ శుభకార్యమైనా ఇంటిని రంగులతో అలంకరించాలని కోరుకుంటాం అభిమాన నాయకుడు, హీరోపై ప్రేమను చాటేలా, దేవుని తిరునాళ్ల సందర్భంగా భక్తిపారవశ్యం ఉప్పొంగేలా బ్యానర్లు కట్టాలని భావిస్తాం. ఈ పనులకు మనకు తొలుత గుర్తొచ్చేది పెయింటర్లే. ఈ వృత్తికి గతంలో బాగా డిమాండ్ ఉండేది. గుంటూరు జిల్లాలో సుమారుగా 30వేల మందికిపైగానే పెయింటర్లు ఉన్నారు. గుంటూరు నగరంలో సుమారు 10వేల మందికిపైగా ఉండవచ్చని పెయింటర్ అసోసియేషన్ల అంచనా. అయితే కొన్నేళ్లుగా వీరి వృత్తి సజావుగా సాగడం లేదు. అధునాతన యంత్రాలతో ఇతర రాష్ట్రాల నుంచి కూలీలు వస్తుండడంతో స్థానిక పెయింటర్ల ఉపాధికి గండి పడుతోంది. ఫలితంగా కుటుంబాలు పోషించుకోలేని దైన్యంలో కార్మికులు కొట్టుమిట్టాడుతున్నారు.

యాంత్రీకరణతోనే నష్టం

గతంలో సాధారణ ఇంటి నుంచి రెండు, మూడు అంతస్తుల భవనాలు, బహుళ వ్యాపార సముదాయాలకూ పెయింటర్లే రంగులు వేసేవారు. ఫలితంగా ఏడాదిలో ఆరు నెలల పాటు వీరికి పుష్కలంగా పని దొరికేది. అయితే ఇప్పుడు ఆధునిక యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. రంగుల నుంచి రకరకాల డిజైన్లను యంత్రాలే వేసేస్తున్నాయి. దీంతో పెయింటర్లకు పని దొరకడం లేదు. అరకొరగా పని దొరికినా ఉదయం నుంచి చీకటి పడే వరకు రంగులు వేసినా రూ.600 నుంచి రూ.700 కూలి రావడం గగనమైంది. అది కూడా ఏడాదిలో కేవలం రెండు, మూడు నెలలే పనులు ఉంటున్నాయి. ఇళ్ల నిర్మాణాల సమయంలో రంగులు వేసే పనులను తాపీ మేస్త్రీలే ఒప్పుకోవడం కూడా పెయింటర్ల జీవనాన్ని దెబ్బతీస్తోంది. దీనికి తోడు కంప్యూటర్‌పై ఫ్లెక్సీలు తయారు చేసే వ్యవస్థ రావటంతో బ్యానర్‌లపై బొమ్మలు, పెయింటింగ్‌లు వేసే పరిస్థితి దాదాపు కనుమరుగైంది.



మూడు అంతస్తులపై ప్రమాదకర రీతిలో రంగులు వేస్తున్న పెయింటర్

ప్రత్యామ్నాయం వైపు..

పనులు లేకపోవడంతో పెయింటర్లు ప్రత్యామ్నాయ వృత్తులవైపు మళ్లుతున్నారు. కొందరు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. రంగుల షాపులు, కిరాణా దుకాణాల్లో గుమాస్తాలుగా చేరుతున్నారు. పూల దుకాణాల్లో కూలీలుగా బార్లలో వెయిటర్లుగా మారుతున్నారు.

ప్రమాదాలతో.. ఊయలూగుతూ..

బహుళ అంతస్తుల భవనాలకు రంగులు వేయడం ఓ సాహసమే. తాళ్ల సాయంతో గాలిలో ఊగుతూ రంగులు వేయాల్సి ఉంటుంది. ఇలా వేసే క్రమంలో ప్రమాదాలు జరిగే ఆస్కారం మెండుగా ఉంది. రంగులు వేసే క్రమంలో కార్మికులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. ప్రాణాలకు తెగించి పెయింటింగ్ వృత్తిని నమ్ముకున్న కుటుంబాలు ఇప్పుడు ఆకలికేకలతో ఆర్తనాదాలు చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల కులవృత్తులకు విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఆర్థికసాయం అందించేందుకు చర్యలు తీసుకుంది. ఈ పథకంలో పెయింటర్లను చేర్చకపోవడంతో సర్వత్రా ఆవేదన వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెయింటర్ల సంక్షేమానికి కృషి చేయాలనే వినతులు వెల్లువెత్తుతున్నాయి.

"వృత్తిని నమ్ముకుని బతుకుతున్నాం



ఎన్నోఏళ్ల నుంచి పెయింటింగ్ వృత్తిని నమ్ముకున్నాం. ఆధునిక యంత్రాల రంగప్రవేశంతో పనులు దొరకడం లేదు. ఆకలికేకలు తప్పడం లేదు. ప్రభుత్వమే మమ్మలను ఆదుకోవాలి.

– షేక్ బాషా, పెయింటర్

పింఛన్లు, గృహాలు మంజూరు చేయాలి



ఈ వృత్తి ద్వారా కుటుంబ పోషణ భారమవుతోంది. ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని రుణాలు మంజూరు చేయాలి. ఈ డబ్బుతో యంత్రాలు కొనుక్కుని జీవనోపాధి పొందుతాం. పింఛన్లు, గృహాలు ఇచ్చి మా సంక్షేమానికి కృషి చేయాలి.

– ఎస్.రాము, పెయింటర్"

గోకులాల నిర్మాణాలు వేగవంతం చేస్తాం

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



గుంటూరు వెస్ట్: జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన మినీ గోకులాల నిర్మాణాలు నిర్దేశించిన సమయంలోనే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజయవాడ నుంచి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వర్చువల్‌గా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు మొత్తం 390 మినీ గోకులాలు మంజూరయ్యాయన్నారు. వీటిలో 284 నిర్మాణాలు పూర్తి చేసామన్నారు. మిగిలినవి వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ నెల చివరి నాటికి మొత్తం పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో జడ్పీ సీఈఓ జ్యోతిబసు, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య, డ్వామా పీడీ శంకర్ అధికారులు పాల్గొన్నారు.

29న జెడ్పీ సర్వసభ్య సమావేశం

బడ్జెట్ ఆమోదమే ఏకైక అజెండా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 29న జెడ్పీ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. జెడ్పీ 2024-25 సవరణ బడ్జెట్‌తో పాటు 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్ ఆమోదింపచేసుకోవడమే ఏకైక అజెండాగా సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. మండల పరిషత్‌లకు ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించాల్సి ఉంది. కాగా ఈనెల 15న ఏర్పాటు చేసిన జెడ్పీ సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడిన విషయం తెలిసిందే. జెడ్పీటీసీ సభ్యులకు తెలియకుండా అభివృద్ధి పనులకు ముందస్తు అనుమతుల పేరుతో ఇష్టారాజ్యంగా నిధులు కేటాయింపుపై ఆగ్రహం వ్యక్తం చేసిన వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులు సమావేశానికి గైర్హాజరైన నేపథ్యంలో మరోసారి సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన జరగనున్న సర్వసభ్య సమావేశంలో అజెండా ఆమోదం కోసం కసరత్తు చేస్తున్నారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుల వ్యూహాత్మక నిర్ణయం కారణంగా బడ్జెట్ ఆమోదం కీలకంగా మారనుంది. జెడ్పీటీసీ సభ్యులమైన తమకు తెలియకుండా, తమ అనుమతి లేకుండా అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్సులతో చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా రూ.కోట్లాది విలువైన పనులకు ఏకపక్షంగా ఆమోదించడాన్ని సహించలేక గత సమావేశానికి గైర్హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీలు చెబుతున్న అంశాలకు సర్వసభ్య సమావేశం బడ్జెట్ అజెండాలో ముందస్తు అనుమతుల పేరుతో రూ.12 కోట్ల విలువైన పనులకు పరిపాలన అనుమతులు ఇచ్చినట్టు పేర్కొనడమే సాక్ష్యంగా ఉంది.

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌తోపాటు పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ అండ్‌ఎస్ ఇంజినీరింగ్ శాఖల వారీగా 2024-25 ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్ రూ.492 కోట్ల 79 లక్షల 43వేల 239ను ఆమోదించాల్సి ఉంది.

జెడ్పీ బడ్జెట్ స్వరూపం

అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాబడులు, ఆదాయాలు కలుపుకుని రూ.643 కోట్ల 80 లక్షల 68వేలుగా అంచనా వేశారు. వ్యయం, ఖర్చుల కింద రూ.640కోట్ల 74లక్షల 13వేలు అంచనా వేశారు. మిగులు బడ్జెట్ రూ.మూడుకోట్ల ఆరు లక్షల 5వేలుగా చూపారు.

- పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్‌ను మినహాయించి ప్రత్యేకంగా జెడ్పీ బడ్జెట్‌ను పరిశీలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్‌లో రాబడులు, ఆదాయాలు రూ.64,02,07,000 కాగా వ్యయం, ఖర్చులను రూ.62,21,77,000వేలుగా మిగులు బడ్జెట్ రూ.కోటీ 80 లక్షల 30 వేలుగా చూపారు. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం, రాబడులు రూ.71,11,57,000లు కాగా వ్యయం, ఖర్చులు 69,10,87,000 పోనూ మిగులు రూ.రెండు కోట్ల 70వేలుగా చూపారు.

ఆర్చరీ చాంపియన్ షిప్ ప్రారంభం



విల్లు ఎక్కు పెట్టి పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏఎన్‌యూ(గుంటూరు): ఏపీ ఆర్చరీ అకాడమీ ఆధ్వర్యంలో యూనివర్సిటీలో నిర్వహిస్తున్న లెనిన్ ఓల్గా మెమోరియల్ అండర్-13, అండర్-10 ఆర్చరీ చాంపియన్‌షిప్ శుక్రవారం యూనివర్సిటీలో ప్రారంభమైంది. ప్రారంభోత్సవ సభకు ఏఎన్‌యూ వీసీ కె.గంగాధరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ ఆర్చరీ పోటీలకు ఏఎన్‌యూ వేదిక కావడం ఆనందదాయకమన్నారు. భవిష్యత్తులో విలువిద్యకు వర్సిటీ పూర్తి సహకారం అందిస్తుందన్నారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య కె రత్నషీలామణి మాట్లాడుతూ క్రీడారంగ అభివృద్ధికి యూనివర్సిటీలో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం మాట్లాడుతూ ఆర్చరీ క్రీడను రానున్న రోజుల్లో ఏఎన్‌యూలో ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్, నేషనల్ జడ్జి బి.వి.రమణ తదితరులు పాల్గొన్నారు. ఈ చాంపియన్‌షిప్‌లో దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి అండర్-13 విభాగంలో 700 మంది ఆర్చర్లు (బాలురు, బాలికలు) పాల్గొంటున్నారు. తొలిరోజు రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాలలో ర్యాంకింగ్ పోటీలు జరిగాయి.



పోటీలు ప్రారంభిస్తున్న వీసీ గంగాధరరావు

ఏఎన్‌ఎం ఉద్యోగోన్నతుల్లో మాయాజాలం

- నిబంధనలకు తూట్లు
- భర్త కాంట్రాక్టు ఉద్యోగి అయినా స్పౌజ్ కోటా అమలు
- డీఎంహెచ్‌ఓ కార్యాలయం తీరుపై విమర్శలు

గుంటూరు మెడికల్: ఏఎన్‌ఎంల ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్‌లో అనేక తప్పిదాలు జరిగాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారులు నిబంధనలకు తిలోదకాలిచ్చారని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఏఎన్‌ఎం భర్త కాంట్రాక్టు ఉద్యోగి అయినా స్పౌజ్ కోటా వర్తింపజేశారని, వాస్తవానికి కాంట్రాక్టు ఉద్యోగులకు ఈ నిబంధన వర్తించదని చెబుతున్నారు. ప్రలోభాలకు లొంగిపోయిన కొంత మంది ఉద్యోగులు, అధికారుల తీరు వల్లే ఇలా జరిగిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తొలి నుంచీ విమర్శలే..

గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 266 మంది గ్రేడ్-3 ఏఎన్‌ఎంలకు ఈనెల 17న కౌన్సెలింగ్ నిర్వహించి మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ ఫిమేల్‌గా ప్రమోషన్ ఇచ్చారు. సోమవారం ఉదయం నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు జరిగిన కౌన్సెలింగ్‌లో అనేక తప్పిదాలు దొర్లాయి. సీనియార్టీ జాబితాలో ఖాళీలు సక్రమంగా చూపించలేదని పలువురు యూనియ నేతలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వాటిని సరిచేయకుండానే కౌన్సెలింగ్ నిర్వహించారు. కొన్ని ప్రదేశాల్లో పోస్టులు ఖాళీ లేకపోయినా ప్రమోషన్ ఆర్డర్ ఇవ్వడం ద్వారా అక్కడ వేతనాలు, హెచ్‌ఆర్‌ఏలు తీసుకునే వెసులుబాటు లేక సిబ్బంది తిరిగి కార్యాలయానికి వచ్చి మరోప్రాంతం కోరుకోవాల్సి వచ్చింది. ప్రమోషన్ ఉత్తర్వులు ఇచ్చేందుకూ కార్యాలయ ఉద్యోగులు ముడుపులు దండుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. కోరుకున్న ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కొంత మంది ముడుపులు ఇచ్చుకోవాల్సి వచ్చిందని సమాచారం.

ప్రాధాన్యం ఇచ్చే విషయాల్లో తప్పిదాలు..

ప్రభుత్వ సర్వీసులో భార్య, భర్తలు ఇద్దరూ పనిచేస్తుంటే వారికి తొలి ప్రాధాన్యం ఇచ్చి సీనియార్టీ జాబితాలో తొలుత వారిని కౌన్సెలింగ్‌కు పిలిచారు. అయితే కొందరు కాంట్రాక్టు ఉద్యోగులూ తమ భర్తలు రెగ్యులర్ ఉద్యోగాలు చేస్తున్నారంటూ సర్టిఫికెట్లు పెట్టి కోరుకున్న ప్రాంతాలు దక్కించుకున్నట్టు సమాచారం. ఇది నిబంధనలకు విరుద్ధమని తెలిసినా అధికారులు వారిని ప్రోత్సహించారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా జరిగిన తప్పిదాలను అధికారులు సరిదిద్దాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి.

మందుల దుకాణాలపై దాడులు

- అనుమతులు లేకుండా గోదాం నిర్వాహణ
- భారీగా అక్రమ ఔషధాలు స్వాధీనం
- దాడుల్లో పాల్గొన్న విజిలెన్స్, డ్రగ్స్ అధికారులు

నరసరావుపేటటౌన్: పట్టణంలోని పలు మందుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఔషధ నియంత్రణ శాఖ అధికారులు సంయుక్తంగా శుక్రవారం దాడులు నిర్వహించారు. ఆపరేషన్ గరుడలో భాగంగా బరంపేటలోని భాగ్యశ్రీ మెడికల్ ఏజెన్సీ దుకాణంలో మొదట తనిఖీలు నిర్వహించారు. దుకాణానికి సంబంధించి రిక్షా సెంటర్ సమీపంలో ఇళ్ల మధ్య ఉన్న గోదాంలో సోదాలు చేపట్టారు. అనుమతులు లేకుండా భారీ స్థాయిలో మందులు నిల్వ ఉంచినట్లు విజిలెన్స్ బృందం గుర్తించింది. మందులను సీజ్ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో ఫిజీషియన్ శాంపిల్స్ ఉన్నట్లు సమాచారం. నరసరావుపేట రూరల్ సీఐ పి. రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. దాడుల్లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మంగమ్మ, పద్మ, విజిలెన్స్ ఏఈఈ శివనారాయణ, ఎఫ్ఆర్ఓ సైదులు, విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు



స్వాధీనం చేసుకున్న నిల్వలు

చట్టాలపై విదార్థులకు అవగాహన అవసరం



బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న న్యాయమూర్తి మధుస్వామి

నరసరావుపేట టౌన్: చట్టాలపై విదార్థులకు కూడా అవగాహన అవసరమని ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కె. మధుస్వామి తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో శుక్రవారం సెల్ఫ్ డిఫెన్స్, పోక్సో చట్టం తదితర అంశాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మధుస్వామి పోక్సో చట్టం గురించి క్షుణ్ణంగా వివరించారు. ఉచిత న్యాయ సహాయం పొందే విధానాలను తెలియజేశారు. రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. విద్యార్థులకు ఎటువంటి సమస్య ఎదురైనా సంకోచించకుండా డయల్ 100కు గానీ, స్థానిక మండల న్యాయ సేవాధికార సంస్థలో గానీ సంప్రదించాలని సూచించారు. విద్యార్థి దశలో కష్టపడి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరేలా కృషి చేయాలని ఆయన తెలిపారు. తొలుత పట్టణ ఎస్ఐ అరుణ మాట్లాడుతూ మహిళల భద్రతకు శక్తి యాప్ రక్షణ కవచమని పేర్కొన్నారు. ప్రతి మహిళా ఫోన్లో నిక్షిప్తం చేసుకొని, ఆపద సమయంలో పోలీసు వారి తక్షణ సహాయం పొందాలని సూచించారు. తొలుత న్యాయమూర్తి హాస్టల్ వంటశాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్‌లు ఎస్. జయప్రద, జయలక్ష్మి పాల్గొన్నారు.

గజేంద్ర మోక్షం అలంకారంలో నారసింహుడు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా స్వామివారు శుక్రవారం గజేంద్ర మోక్షం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యల పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన శేషగిరిరావు, కల్యాణిలు వ్యవహరించగా, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన తాడికొండ తిరుమలరావు, తాడికొండ సాయికుమార్ వ్యవహరించారు. శనివారం స్వామి పార్థసారథి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు ఆలయ ఈఓ రామకోటిరెడ్డి తెలిపారు.

గుంటూరు తాత్కాలిక మేయర్‌గా షేక్ సజీల

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ మేయర్‌గా కావటి శివనాగ మనోహర్ నాయుడు ఈ నెల 15న రాజీనామా చేసిన విషయం తెలిసిందే. నూతన మేయర్ ఎన్నిక జరిగే వరకు డెప్యూటీ మేయర్ షేక్ సజీల తాత్కాలిక మేయర్‌గా బాధ్యతలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని మేయర్ కార్యాలయంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, గుంటూరు తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవిల సమక్షంలో సజీల తాత్కాలిక మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సజీల మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని చెప్పారు. కమిషనర్ పులి శ్రీనివాసులు మాట్లాడుతూ మేయర్ రాజీనామాతో ప్రభుత్వ ఆదేశాల మేరకు సజీల మేయర్‌గా బాధ్యతలు తీసుకున్నారని, త్వరలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు రెగ్యులర్ మేయర్ ఎన్నికకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈనెల 25న గత మేయర్ రాజీనామా ఆమోదం కోసం అత్యవసర సమావేశం జరుగుతుందని వెల్లడించారు.



మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న షేక్ సజీల

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 6,500 గరిష్టం : రూ. 8,000

మోడల్ ధర రూ. 7,400

క్లుప్తంగా

1,21,706 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 1,12,589 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,21,706 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,500 నుంచి రూ.13,800 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.7,200 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 51,200 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

జన గణనతోపాటే కులగణన జరపాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు



మంగళగిరి: జనగణనతోపాటే సమగ్ర కులగణన జరపాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓబీసీల ప్రధాన డిమాండ్లపై జాతీయస్థాయిలో ఈ నెల 24,25,26 తేదీలలో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. మహిళా రిజర్వేషన్ కోటాలో ఓబీసీ మహిళల సబ్ కోటా చేయాలని డిమాండ్ చేశారు. ఓబీసీల ప్రధాన డిమాండ్లపై 24న కేంద్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులను కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమగ్ర కుల గణనలో జాప్యాన్ని నిరసిస్తూ జంతర్ మంతర్ వద్ద 25న ధర్నా చేపడతామన్నారు. 26న ఓబీసీ మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జంతర్‌మంతర్ వద్ద నిరసన కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతికుమార్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఉప్పాల శివలక్ష్మి, శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మేము చాలా ప్రమాదంలో ఉన్నాం

- గంజాయి మత్తులో యువకులు హల్‌చల్ చేస్తున్నారు
- ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారు
- ఎస్పీ వద్ద నులకపేట ప్రజల ఆవేదన
- చర్యలు తీసుకుంటామన్న ఎస్పీ



ఎస్పీ సతీష్‌కుమార్‌తో మాట్లాడుతున్న మహిళలు

తాడేపల్లిరూరల్: చాలా ప్రమాదంలో ఉన్నామని, గంజాయి మత్తులో యువకులు హల్‌చల్ చేస్తున్నారని గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్ ఎదుట నులకపేట ప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో దాదాపు 200 మంది సిబ్బంది కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి పత్రాలు లేని ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను పోలీసులు సీజ్ చేశారు. అనంతరం విలేకరులతో ఎస్పీ మాట్లాడుతుండగా స్థానిక మహిళలు వచ్చి ఆయనకు తమ గోడు విన్నవించుకున్నారు. గంజాయి మత్తులో యువకులు రోడ్లపై ద్విచక్రవాహనాలు వేసుకుని హల్‌చల్ చేస్తున్నారని, ప్రశ్నిస్తే దాడులకు పాల్పడుతున్నారని వివరించారు. తలుపులు వేసుకుని ఇంటి గేటుకు తాళం వేసుకుని ఇంట్లో ఉన్నా ఎక్కడెక్కడి నుంచో యువకులు వచ్చి ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని వెల్లడించారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు వచ్చే విద్యార్థినులను వేధిస్తున్నారని పేర్కొన్నారు. రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వారిని బెదిరిస్తున్నారని వివరించారు. పోలీసులు ప్రధాన వీధుల్లోనే రాత్రి గస్తీ తిరుగుతున్నారని, లోపల వీధుల్లోకి రావడం లేదని పేర్కొన్నారు. స్పందించిన ఎస్పీ మాట్లాడుతూ గంజాయి మూకలపై చర్యలు తీసుకుంటామని వివరించారు. రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపుతామన్నారు. సరైన పత్రాలు లేని 23 వాహనాలను సీజ్ చేశామని వెల్లడించారు. తనిఖీల్లో అడిషనల్ ఎస్పీ రవికుమార్, డీఎస్పీ మురళీకృష్ణ, సీఐ కళ్యాణ్ రాజు, ఎస్ఐలు ఖాజావలి, శ్రీనివాసరావు, నార్త్ సబ్ డివిజన్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులు సీజ్ చేసిన వాహనాలు

స్థల వివాదం నేపథ్యంలో ఇంటిపై దాడి



శాంతినగర్ ఇంటిలోని గృహోపకరణాలు ధ్వంసం చేసిన దృశ్యం



ఇంటిని ధ్వంసం చేసిన దృశ్యం

- ఇల్లు, ఇంట్లో గృహోపకరణాలు ధ్వంసం
- నిందితులు అధికారపార్టీ ఎమ్మెల్యే అనుచరులుగా గుర్తింపు !
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు



ఇంటిపై దాడికి వచ్చిన భాస్కర్ అనుచరులు

లక్ష్మీపురం(గుంటూరువెస్ట్): స్థల వివాదం నేపథ్యంలో ఓ ఇంటిపై కొందరు దాడి చేసి ఇంటిని, ఇంట్లోని గృహోపకరణాలను ధ్వంసం చేశారు. ఈ ఘటన శుక్రవారం గుంటూరు నగరంలోని ఏటి అగ్రహారం శాంతినగర్ 4వ లైన్‌లో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. శాంతినగర్‌లోని ఇంటిలో జాజుల ఏడుకొండలు, అతని భార్య తిరుపతమ్మ ఉంటారు. వీరికి నలుగురు సంతానం. అదే ఇంట్లో అతని తమ్ముడు జాజుల బాల నరసింహారావు, అతని భార్య నాగమణి కూడా నివాసం ఉంటారు. ఏడుకొండలు ఫైనాన్స్, గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. 2021లో శాంతినగర్ 4వ లైన్‌లో 216 గజాల స్థలం శ్రీనివాసరావుపేటకు చెందిన కాశీవిశ్వనాథ్ కుమారుడు రవీంద్రబాబు వద్ద ఏడుకొండలు కొని ఇల్లు కట్టాడు. రవీంద్రబాబుకు శ్రీనివాసరావుపేటకు చెందిన పెడమల్లు భాస్కర్‌ల మధ్య కోర్టులో స్థల వివాదం నడుస్తోంది. 2018లో రవీంద్రబాబుపై భాస్కర్ కోర్టులో గెలిచారు. 2021లో స్థలాన్ని రవీంద్రబాబు వద్ద నుంచి కొన్న ఏడుకొండలును ఇల్లు ఖాళీ చేయాలంటూ మల్లు భాస్కర్ వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. శుక్రవారం ఏడుకొండలు, భార్య తిరుపతమ్మ బయటకు వెళ్లగా ఇంట్లో ఏడుకొండలు తమ్ముడు బాలనరసింహారావు, అతని భార్య నాగమణి ఉన్నారు. పెడమల్లు భాస్కర్ ఆయన సతీమణి భూలక్ష్మి పల్నాడు జిల్లాకు చెందిన అధికార పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అనుచరులు అయిన ఆలపాటి నాని, అశోక్‌లతోపాటు సుమారు 30 మందితో ఇంటిపైకి వచ్చి దాడి చేసి ఇంటిని, ఇంట్లో ఉన్న గృహోపకరణాలు ధ్వంసం చేశారు. బాధితులు 112కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నగరంపాలెం పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలం వద్దకు చేరుకుని అందరినీ అక్కడి నుంచి తరిమేసి పెద్దమల్లు భాస్కర్‌ని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. బాధితులు తేరుకొని నగరంపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు.

24న శాంతియుత నిరసన

గుంటూరు మెడికల్: డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో దీర్ఘకాలంగా ఉన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం మార్చి 24న రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో శాంతియుత నిరసన తెలియజేయనున్నట్లు ఎన్టీఆర్ వైద్య మిత్ర అసోసియేషన్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్, వర్కింగ్ ప్రెసిడెంట్ సుజాత, జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ శివకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుంటూరులోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా సమన్వయకర్త (డీసీ) ఆఫీసుల వద్ద విధులు బహిష్కరించి నిరసన తెలియజేస్తామని పేర్కొన్నారు. ఈనెల 27న మంగళగిరిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ఆఫీస్ వద్ద గాంధేయ పద్ధతిలో శాంతియుత నిరసన తెలుపుతామని వెల్లడించారు. ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిద్దాం

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి



తెనాలిఅర్బన్: ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ కొర్ర విజయలక్ష్మి సూచించారు. మలేరియా విభాగం ఆధ్వర్యంలో నరేంద్రదేవ్ కాలనీలో శుక్రవారం దోమలపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమల నివారణ గురించి వివరించారు. జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బారాయణం మాట్లాడుతూ జ్వర లక్షణాలు ఉంటే వెంటనే చికిత్స పొందాలని సూచించారు.

24న రవాణా రంగ కార్మికుల 'చలో పార్లమెంట్'



చలో పార్లమెంట్ కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంఘ నాయకులు

లక్ష్మీపురం: ట్రాన్స్‌పోర్ట్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్) ఆధ్వర్యంలో ఈనెల 24న చలో పార్లమెంట్ చేపట్టినట్లు సంఘ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు పిలుపునిచ్చారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని ఆటో స్టాండ్‌ల వద్ద 'చలో పార్లమెంట్' పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత రవాణా రంగంపై పెద్ద ఎత్తున దాడి ప్రారంభించిందని ఆరోపించారు. భారతీయ న్యాయ సంహిత 2023 సెక్షన్ 106(1), (2)ను తీసుకురావడం చిన్న చిన్న తప్పిదాలకు కూడా డ్రైవర్లను బాధ్యులు చేయటం భారీ శిక్షలు, జరిమానాలు విధించడం వంటి చర్యలు రవాణా రంగాన్ని నిర్వీర్యం చేయడమేనని ధ్వజమెత్తారు. వాహన ఫిట్నెస్ సర్టిఫికెట్లను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడం కార్మికులపై అదనపు భారాన్ని మోపడమేనని ఆవేదన చెందారు. రాష్ట్రంలో భారీ పెనాల్టీలు విధిస్తూ తీసుకొచ్చిన జీఓ నంబర్ 21నుతక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నగర ఆటో డ్రైవర్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కే శ్రీనివాసరావు, వెంకట్, జానీ పాల్గొన్నారు.

పత్తి ఉత్పత్తిని పెంచేందుకు కృషి జరగాలి



కార్యక్రమంలో పాల్గొన్న విశ్వవిద్యాలయం అధికారులు, ఐసీఏఆర్, సీఐసీఆర్ శాస్త్రవేత్తలు తదితరులు

పత్తిపంట అఖిల భారత వార్షిక సమూహ సమావేశంలో వక్తలు

గుంటూరు రూరల్: దేశంలో పత్తి పంట ఉత్పత్తి పెంచేలా కృషి జరగాలని వక్తలు అభిప్రాయపడ్డారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఎన్జీ రంగా వర్సిటీలో ఐసీఏఆర్ సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాటన్ రీసెర్చ్ (ఐసీఏఆర్– సీఐసీఆర్), వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్తంగా పత్తి వార్షిక సమూహ సమావేశం (ఏజీఎమ్) 2025ను శుక్రవారం ప్రారంభించారు. మూడురోజులపాటు జరిగే ఈ సమావేశానికి దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ శాస్త్రవేత్తలు, విత్తన కంపెనీల ప్రతినిధులు ముఖ్య భాగస్వాములు హాజరయ్యారు. పత్తి ఉత్పత్తి పెంపుపై చర్చించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎన్జీరంగా వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి అధ్యక్షత వహించారు. ఆమె పురుగు మందుల వినియోగాన్ని తగ్గించడంలో బీటీ పత్తి కీలకపాత్ర పోషించినట్లు వివరించారు. వర్సిటీ విడుదల చేసిన నరసింహ (ఎన్ఏ–1325) పత్తి రకం విజయ ప్రస్థానం గురించి చెప్పారు. పత్తి రైతుల నికర ఆదాయాన్ని గణనీయంగా పెంచడంలో ఇది దోహదపడిందని తెలిపారు. డాక్టర్ పీవీ సత్యనారాయణ మాట్లాడుతూ దేశంలో పత్తి ఉత్పత్తి పెంపునకు కృషి జరగాలని చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్, సిఐసిఆర్ నాగపూర్ సంచాలకులు డాక్టర్ వైజి ప్రసాద్, ఐసీఏఆర్, సీఐఆర్‌సీఓటీ ముంబై డైరెక్టర్ డాక్టర్ ఎస్‌కే శుక్లా, ఐసీఏఆర్ పంట శాస్త్ర విభాగం సహాయ డైరెక్టర్ జనరల్ (వాణిజ్య పంటలు) డాక్టర్ ప్రశాంతకుమార్‌దాస్, పత్తి ప్రాజెక్ట్ పర్యవేక్షణ, సలహా కమిటీ చైర్మన్ డాక్టర్ సిడి మాయీ తదితరులు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఆచార్య కృపాచారికి పరిశోధక గురు పురస్కారం



కృపాచారిని పురస్కారంతో సత్కరించిన ఆచార్య ఇనాక్

తెనాలి: ఆచార్య నాగార్జున యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యుడు, దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి పరిశోధక గురువుగా చేసిన సేవలు ప్రశంసనీయమని ప్రముఖ రచయిత, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. స్థానిక చెంచుపేట డొంకరోడ్డులోని ఆచార్య కృపాచారి నివాసానికి శుక్రవారం ఆచార్య ఇనాక్ వచ్చారు. పరిశోధక గురు పేరుతో కొలకలూరి పురస్కారాన్ని ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాము ఏటా ప్రదానం చేస్తున్న కొలకలూరి పురస్కారాలను రచయితలతోపాటు పరిశోధకులు, పరిశోధక గురువుకు కూడా అందజేస్తున్నామని గుర్తుచేశారు. ఈ ఏడాది ప్రకటించిన అవార్డుల్లో పరిశోధక గురు అవార్డుకు కృపాచారిని ఎంపిక చేశామని తెలిపారు. ఆరోగ్య కారణాలతో హైదరాబాద్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ సభకు కృపాచారి హాజరుకాలేకపోయారని చెప్పారు. అందుచేత తానే స్వయంగా తెనాలి వచ్చి కృపాచారికి ఈ పురస్కారాన్ని అందజేసినట్టు ఆచార్య ఇనాక్ వివరించారు. కృపాచారి పర్యవేక్షణలో 75 మంది పీహెచ్‌డీలు, 68 మంది ఎంఫిల్ చేసినట్టు గుర్తుచేశారు. పలు విశ్వవిద్యాలయాలకు 45 పాఠ్యగ్రంథాలను అందించారనీ, పలు అవార్డులను స్వీకరించారని గుర్తుచేశారు. పురస్కారం స్వీకరించటంపై కృపాచారి సంతోషాన్ని ప్రకటించారు.

కూటమి నేతలకు తొత్తులుగా అధికార యంత్రాంగం

గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకిరెడ్డి నాగనారాయణమూర్తి



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ అనుబంధ సంస్థల నాయకులు

తాడేపల్లిరూరల్: కూటమి నేతలు చెప్పినట్టు అధికారులు పనిచేస్తున్నారని, తక్షణమే వారి తీరు మార్చుకోవాలని వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అంకిరెడ్డి నాగనారాయణమూర్తి హితవు పలికారు. మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన సతీమణి భారతి ఫొటోలు మార్ఫింగ్ చేస్తూ కొంతమంది సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యవహారంపై శుక్రవారం మరోసారి తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రశ్నించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారని చెప్పారు. అలాగే మాజీ సీఎం వైఎస్ జగన్, ఆయన కుటుంబం, మహిళా నాయకులు, కార్యకర్తలు, మాజీ ఎమ్మెల్యేలపై ఫేస్‌బుక్‌లో, ఇతర సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా మాట్లాడుతూ, ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు పెడుతున్నారని, వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.341కోట్లు మంజూరు

నెహ్రూనగర్: ఎస్సీల అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున స్వయం ఉపాధి పథకాలు అమలు చేయడం జరుగుతుందని, ఎస్సీ కార్పొరేషన్‌కు రూ. 341 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని, ఇందుకు సంబంధించిన యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు రాష్ట్ర మాదిగ వెల్ఫేర్, కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో రాష్ట్ర మాదిగ వెల్ఫేర్, కో–ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయితో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సబ్సిడీ రుణాలకు ప్రజల నుంచి ఏ విధంగా అర్జీలు తీసుకుని పరిష్కరిస్తున్నారో చూడడానికి ఎస్సీ కార్పొరేషన్‌కు రావడం జరిగిందన్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లోని 15 ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌లలోని 295 షాపులకు మరమ్మతులు చేసేందుకు రూ.121.75 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు ఉన్నతి పథకంలో రూ. 2 కోట్ల 83 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

ముగిసిన ఏఎన్‌యూ ఇంటర్ కాలేజియేట్ బేస్‌బాల్ మెన్ టోర్నీ



విన్నర్ ట్రోఫీని అందుకున్న ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టుతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: క్రీడా స్ఫూర్తి జీవితంలో ఉన్నస్థాయికి చేరుస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరుగుతున్న ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అంతర్ కళాశాలల బేస్ బాల్ (మెన్) టోర్నమెంట్ శుక్రవారంతో ముగిసింది. ఆర్‌వీఆర్‌జేసీ కళాశాల జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచి, విన్నర్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రన్నర్ ట్రోఫీని ఏఎన్‌యూ ఫిజికల్ కళాశాల జట్టు సాధించింది. తృతీయ స్థానంలో ఎమ్ఏఎమ్ పిజి కాలేజీ, నాలుగో స్థానంలో సిఆర్ కాలేజీ జట్లు నిలిచి ట్రోఫీలను అందుకున్నాయి. టోర్నమెంట్‌లో మెరుగైన ప్రదర్శన కనబరిచిన క్రీడాకారులతో ఏఎన్‌యూ సాఫ్ట్ బాల్ (మెన్) జట్టును సెలెక్షన్ కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె శ్రీనివాస్ డైరెక్టర్ డాక్టర్ కె రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, పీడీలు డాక్టర్ పి. గౌరీశంకర్, డాక్టర్ ఎం.శివరామకృష్ణ, ఏఎన్‌యూ టోర్నమెంట్ అబ్జర్వర్ డాక్టర్ సూర్యనారాయణ, సెలెక్షన్ కమిటీ మెంబర్స్ డాక్టర్ పీ శ్రీనివాస్, డాక్టర్ ఎమ్ బుచ్చిబాబు, డాక్టర్ రాజామెరిసిన్‌బాబు, జె.ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమ్మెకు సీఐటీయూ మద్దతు

బాపట్ల టౌన్: సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 24, 25వ తేదీల్లో బ్యాంకు ఉద్యోగులు చేపట్టబోయే సమ్మెకు మద్దతు ఇస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ తెలిపారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బ్యాంకు ఉద్యోగులపై భారం పెరిగిందన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలన్నారు. యూఎఫ్‌బీయూ నాయకత్వంలో పోరాటానికి అందరూ మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సమ్మె కేవలం బ్యాంకింగ్ రంగ పరిరక్షణ కోసమే చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా జీతభత్యాలు, ఉద్యోగులకు ఆర్థిక డిమాండ్లు లేవన్నారు.

విజ్ఞాన్ నిరులోత్సవ్–2కే25 ప్రారంభం



రిబ్బన్ కట్‌చేసి వేడుకలను ప్రారంభిస్తున్న మధుమూర్తి, లావు రత్తయ్య తదితరులు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

గుంటూరు రూరల్: విద్యార్థులు ఆకాశాహ దృక్పథంతో ముందుకు సాగాలని ఏపీఎస్‌సీహెచ్ఈ (ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్) చైర్మన్ ప్రొఫెసర్ కె.మధుమూర్తి చెప్పారు. పలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించనున్న జాతీయస్థాయి టెక్ ఒడిస్సీ, కల్చరల్ కాస్కేడ్, క్రియేటివ్ కాన్వస్, వర్డ్ సింఫణీ, బిజినెస్ పరేడ్, చిల్ థ్రిల్, స్పోర్ట్స్ ఫెస్ట్ నిరులోత్సవ్–2కే25ను శుక్రవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధుమూర్తి మాట్లాడుతూ విద్యార్థులకు సూచనలు చేశారు. ఐబీఎం ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ టెక్నికల్ టీమ్ లీడర్, విజ్ఞాన్ నిరుల పూర్వ విద్యార్థి నారేడ్ల లావణ్య మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. విజ్ఞాన్ సంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న వాళ్లే జీవితంలో నిలబడతారని చెప్పారు. శనివారం జరిగే ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గౌరవ అతిథిగా యాంకర్, యాక్టర్ విజ్ఞాన్ పూర్వ విద్యార్థి ప్రదీప్ మాచిరాజు రానున్నారని ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాధిక తెలిపారు. ఫెస్ట్‌కు సుమారుగా 200 కళాశాలల నుంచి 15 వేల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. అనంతరం 45కుపైగా అంశాల్లో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను విశేషంగా అలరించాయి. అనంతరం కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను యాజమాన్య ప్రతినిధులు సన్మానించారు.